క్లుప్తంగా

ఘనంగా హనుమత్ రక్షాయాగం



వినుకొండ (నూజెండ్ల): హనుమత్ జయంతి పర్వదినం సందర్భంగా రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో హనుమత్ రక్షాయాగం నిర్వహించారు. గత 40 రోజుల నుంచి దీక్ష తీసుకున్న స్వాములచే యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రవ్వవరం ఆర్‌బీకేలో దొంగతనం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని పుచ్చనూతల పంచాయతీ పరిధిలోని రవ్వవరం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆర్‌బీకేలోని కంప్యూటర్‌కు సంబంధించిన కొన్ని వస్తువులను, ఒక ట్యాబ్‌ను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ విషయంపై ఆర్‌బీకే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శావల్యాపురంలో ప్రజావేదిక



శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ ఉపాధి పథకం 16వ విడత సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక కార్యక్రమం శనివారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 గ్రామ పంచాయతీలలో 521 పనులకు గాను రూ. 5 కోట్ల 79 లక్షల 14 వేల 437 రూపాయలు వెచ్చించారు. గ్రామాల వారీగా చేసిన పనులు నిధులు వెచ్చింపుపై సదస్సులో వివరించారు. అనంతరం మండలంలోని అన్నీ గ్రామాల వారీగా రీకవరి రూ.76 వేల 936లు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు గంగవరపు జోసఫ్‌కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి తలారి విజయలక్ష్మి, అవినీతి నిరోధక శాఖాధికారి జి.బాబురావు, ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవోలు రాజు, పి.పద్మజా, టీఎలు శ్రీనివాసగుప్తా, సుబ్బారావు, సుధాకర్ ఉన్నారు.

ఘనంగా ఆంజనేయునికి పూజలు



నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం సువర్చలా సమేత వీరాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పరిమి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్వామి వారికి ఆకుపూజలు, హోమాలు జరగనున్నాయి. అనంతరం ప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. శనివారం సాయంత్రం సాంప్రదాయబద్ధ మేళతాళాలతో స్వామివారి జెండా, ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

రాష్ట్ర వైద్యశాఖ అదనపు డైరెక్టర్ డా.జె.యాస్మిన్

రుద్రవరం(ముప్పాళ్ళ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర వైద్యశాఖ అదనపు(లెప్రసీ) డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ డా.జె.యాస్మిన్ చెప్పారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. మంచంలో ఉన్న వారి వద్ద కు వెళ్లి వారికి అవసరమైన ఆరోగ్య సేవలందించాలన్నారు. గర్భిణులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. షుగర్, బీపీ రోగులకు అందిస్తున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. కుటుంబనియంత్రణ, వ్యాధి నిరోధక టీకాలు, మాతాశిశు సంరక్షణ సేవలపైన ఆరా తీశారు. గ్రామంలో పారిశుద్ధకార్యక్రమాల అమలుపైన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా రికార్డులు పరిశీలించారు. 109 మంది ఓ.పి ఉన్నట్లుగా గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు డి.నవ్య, కార్యాలయ ఏఓ కె.చైతన్య, హెల్త్ సూపర్‌వైజర్ ఏ.పీటర్‌డానియేల్, రవిచంద్ర, ఏఎన్ఎమ్‌లు దివ్యకీర్తి, పద్మ, నజిరున్నీసా, రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థిక, సామాజికాభివృద్ధికి కృషి

- ఐదుగురికి పది ఎకరాల అటవీ భూమి పాస్‌పుస్తకాలు అందజేత
- అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, అధికారులు



గిరిజనులకు అటవీ భూమి పాస్‌పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: గిరిజనుల ఆర్థిక, సామాజికాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు కుటుంబాలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం కేటాయించిన పది ఎకరాల అటవీ భూమికి సబంధించిన పాస్ పుస్తకాలను ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, అటవీశాఖ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. రొంపిచర్ల మండలం చాకలికుంట తండాకు చెందిన ఐదు కుటుంబాలు 2005 నుంచి నకరికల్లు మండలం శివాపురం తండాలోని పది ఎకరాలను సాగు చేసుకుంటున్నారన్నారు. వారికి ఆ పది ఎకరాలపై హక్కు కల్పిస్తూ ఆర్‌ఓఆర్ పట్టాలను విడుదల చేసిందన్నారు. ఇది వారికో వరమన్నారు. మరో 40 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని, వారికి కూడా త్వరలో రీ సర్వే చేయించి పట్టాలు అందజేస్తామన్నారు. వీరందరికి జలకళ పథకం ద్వారా బోర్లు వేయిస్తామన్నారు. లబ్ధిదార్లు మాట్లాడుతూ గతంలో ఎన్నోమార్లు పాస్‌పుస్తకాల కోసం ప్రయత్నించినా ఫలితం లభించలేదన్నారు. సీఎం జగన్ వచ్చిన తర్వాతనే తమకు భూములు లభించాయన్నారు. ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ పీడీ వరలక్ష్మి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి

రొంపిచర్ల: ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో సంతగుడిపాడు, తుంగపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. వారికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి. బాలకోటయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు పలపల రామిరెడ్డి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



నాదెండ్ల: వర్షంతో కూడిన ఈదురు గాలులకు విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలను అధికారులు శనివారం పునరుద్ధరించారు. గణపవరం–కావూరు డొంక రోడ్డులో గురువారం అర్ధరాత్రి ఈదురుగాలులకు తాడిచెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో నాలుగు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో చారిత్రాత్మక వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. దీంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు విద్యుత్ అధికారులకు సమస్యను వివరించారు. దీంతో మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ స్పందించి విరిగిపడ్డ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థి వినికిడి సమస్యకు పరిష్కారం



ఉన్నవలో విద్యార్థికి రూ.40 వేలు అందజేస్తున్న ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

యడ్లపాడు: నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడికి వినికిడి లోపం ఉందని తెలిసి ఎంఆర్ ఫౌండేషన్ స్పందించింది. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన గల్లా వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతుల కుమారుడు మహేష్‌కుమార్‌కు ఐటీఐ చదువుతున్నాడు. చిన్ననాటి నుంచే అతనికి వినికిడి లోపం ఉన్నందున బాధపడుతున్నట్లు ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడి దృష్టికి గ్రామస్తులు తెచ్చారు. విద్యార్థి ఇబ్బందిని గుర్తించి తక్షణమే స్పందించిన రాజేష్ నాయుడు విజయవాడలోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స చేయించి, నాణ్యతతో కూడిన అత్యాధునిక వినికిడి పరికరం కొనుగోలుకు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ తల్లిదండ్రులు మల్లెల రాజేష్ నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఉన్నవ గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో గుత్తి సింగయ్య, గల్లా వీరరాఘవయ్య, వెంకట్రావు, కుంచెనపల్లి సాంబశివరావు, వెంకట్రావు, గ్రామ పెద్దలు, ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

స్నేహమేరా జీవితం.. శాశ్వతం!



శావల్యాపురంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

1997–98 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శావల్యాపురం: ఎప్పుడో చిన్ననాడు వారంతా కలసి చదువుకున్నారు. చదువులమ్మ ఒడిలో హాయిగా బాల్యాన్ని ఆస్వాదించి విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని పెద్ద చదువులు చదివి ఎక్కడెక్కొడో కొలువులు సంపాదించుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదంతా ఎప్పుడో పాతికేళ్లనాటి సంగతి. మళ్లీ ఇవాళ వారంతా చదువులమ్మ చెంతకు తరలివచ్చారు. చదువుకున్న తరగతి గదులు, ఆటలాడిన మైదానాన్ని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. ఆనాడు తాము చేసిన అల్లరి పనులు, చిలిపి చేష్ట లు, మధురానుభూతులను నెమరువేసుకున్నారు. శావల్యాపురంలోని హైస్కూలులో ఆత్మీయ సమ్మేళనం పేరిట శనివారం కలిశారు. పూర్వవిద్యార్థుల రాకతో పాఠశాల కళకళలాడుతూ కనిపించింది. జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1997–98 పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలల్లో స్థిరపడిన ఆయా విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై స్నేహితులను కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకొని తాము చదువుకున్న తరగతి గదులను సహ విద్యార్థులతో సందర్శించి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి పాదాభివందనం చేసుకున్నారు. గురువులతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. గురువులు నేర్పిన పాఠాలే తమ అభివృద్ధికి కారణమని సంతోషం వ్యక్తం చేశారు. పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి తమవంతు ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. అనంతరం అందరు కలిసి గ్రూపు ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు హనుమంతరావు, యోగయ్య, నాగేశ్వరరావు, రాంబాబు, పద్మేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతగుడిపాడులో

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం 2001–02 విద్యా సంవత్సరం పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పాఠశాల మొత్తం కలయతిరిగి తరగతి గదులలో ఉపాధ్యాయులతో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒక్కొక్కరినీ గుర్తు పెట్టుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకుని జోక్స్ వేసుకుంటూ సరదాగా గడిపారు. పాఠశాల ప్లే గ్రౌండ్ దగ్గరకు వెళ్లి సాయంత్రం వేళల్లో వారు ఆడిన ఆటలు గురించి చర్చించుకుంటూ ఆనాటి తీపి జ్ఞాపకాలను చర్చించుకున్నారు.

అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు విద్యాబుద్ధులు నేర్పి తాము ఈ స్థాయికి రావటానికి కృషి చేసిన ఉపాధ్యాయులు వెంకటకోటయ్య, మురళీధర్, కల్లూరు శ్రీనివాసరావు, పుల్లయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సంతగుడిపాడులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కనమర్లపూడిలో తిరునాళ్ల నేడు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో నేడు తిరునాళ్ల వేడుకలు జరుగుతున్నాయి. విద్యుత్ ప్రభలు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అలాగే మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న ఆంజనేయ స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దేవాలయానికి విరాళం

చిలకలూరిపేట: పట్టణంలోని కొమరవల్లిపాడులో వేంచేసి ఉన్న శ్రీభూనీలా రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామి దేవస్థాన పంచాహ్నిక కళ్యాణ మహోత్సవాలలో భాగంగా ఈ నెల 16వ తేదీన 16 రోజుల పండగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు రూ. 50వేలు విరాళాన్ని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేటలో రౌడీ షీటర్ దాడి

చిలకలూరిపేటటౌన్: పాత గొడవల నేపథ్యంలో రౌడీ షీటర్ మరోవ్యక్తిపై దాడిచేసి చాకుతో గాయపరిచిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాగన్నపాలెంకు చెందిన రౌడీషీటర్ జూపల్లి ప్రసాద్‌కు అదే ప్రాంతానికి చెందిన తలమాల బాబురావుతో పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని విశ్వనాథ థియేటర్ సమీపంలో బాబురావును ఆపి గతంలో తనపై ఉన్న కేసును రాజీ చేసుకుందామని జూపల్లి ప్రసాద్ కోరాడు. అందుకు నిరాకరించిన బాబురావుపై భౌతికదాడికి పాల్పడి వెంట తెచ్చుకున్న చాకుతో చాతి, పొట్టభాగంలో పొడిచి పరారయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా బాధితుడిని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌అదాలత్ ద్వారా 161 కేసుల పరిష్కారం


చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండల సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 47, భరణం కేసు ఒకటి, గృహహింస, ఎన్టీసీ కేసులు 83, చెక్కు బౌన్స్ కేసులు 7 మొత్తం 161 కేసులు పరిష్కరించి, వాటి ద్వారా రూ. 52,71,350 పరిహారంగా అందజేశారు.

భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: హనుమత్ జయంతోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి శనివారం పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, ఆకు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి వీవీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రమేష్ బాబు, హనుమాన్ కుమార్, గురు, వసుంధర, చంద్రిక, వెంకటేశ్వర్లు, ఫిరోజి, చిన్న, ప్రసాదు, కృష్ణ సాయి, హరినాథ్, పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వృద్ధుడు

వినుకొండ (నూజెండ్ల): రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన వినుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. తిరుపతి నుంచి గుంటూరు వెళ్తున్న 17262 నంబరు గల రైలు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. ట్రాక్‌మాన్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై ఎర్ర రంగు టీషర్ట్, కాఫీ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని రైల్వేపోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రైల్వే ఎస్ఐ జి.ఆర్.పి. సుబ్బారావు 9948525386 నంబరును సంప్రదించాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు ఆక్రమణ భూములు స్వాధీనం చేసుకుంటాం

- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రత్యేకాధికారి షరీనాబేగం
- వినుకొండ, నరసరావుపేటలలో పర్యటన



మాట్లాడుతున్న షేక్ షరీనాబేగం

నరసరావుపేట: జిల్లాలో ఆక్రమణలో ఉన్న వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములను త్వరలో స్వాధీనం చేసుకోవటం జరుగుతుందని స్టేట్ వక్ఫ్‌బోర్డు ప్రత్యేకాధికారి షేక్ షరీన్‌బేగం వెల్లడించారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు వినుకొండ, నరసరావుపేటలలోని వక్ఫ్‌బోర్డు భూములు, జామియా మసీదు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలితో కలిసి రామిరెడ్డిపేటలో మీడియాతో మాట్లాడారు. వినుకొండలో జామియా మసీదుకు చెందిన భూములు 492, 493 సర్వే నెంబర్లలో 115ఎకరాల్లో 70 నుంచి 80 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయన్నారు. గత ఏప్రిల్‌లో నిర్వహించిన సమావేశంలో ఒక నెలరోజుల వ్యవధిలో ఆ భూములు తిరిగి వక్ఫ్‌బోర్డుకు అప్పగించేలా అంగీకారం జరిగిందన్నారు. ఈ మేరకు కలెక్టర్‌తో సమావేశమయ్యాన్నారు. అక్కడి రాజకీయ నాయకులు కూడా దీనికి మద్దతు తెలియచేశారన్నారు. నరసరావుపేటలోని అంజుమన్ ఇస్లామియా మసీదు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పరిశీలించామన్నారు. దీనిపై కోర్టు స్టే ఉందని, త్వరలో కోర్టులో కౌంటర్ దాఖలు చేసి స్టే వెకేట్ చేయిస్తామన్నారు. త్వరలో నిర్మాణం చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో మాట్లాడామన్నారు.

మనోవికాసానికి మట్టిబొమ్మల తయారీ

వేసవి శిక్షణ శిబిరంలో పిల్లల సృజనాత్మకత



వేసవి శిబిరంలో మట్టిబొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు

యడ్లపాడు: పిల్లల మానసిక వికాసానికి వేసవి శిక్షణ తరగతులు ఎంతో దోహదం చేస్తాయని పీఆర్ విజ్ఞానకేంద్రం కమిటీ సభ్యులు నూతలపాటి కాళిదాసు చెప్పారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ విద్యావిభాగం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు స్థానిక లూథరన్ హైస్కూల్లో కొనసాగుతున్నాయి. శిక్షణలో భాగంగా శనివారం విద్యార్థులకు మట్టిబొమ్మల తయారు చేయడంపై అవగాహన కల్పించారు. క్రాఫ్టటీచర్ లంక లక్ష్మణరావు నేతృత్వంలో వివిధ రకాల బొమ్మలను చేసి చూపించడంతో పాటు విద్యార్థులచే చేయించారు. 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఐదు గంటల పాటు తమ నైపుణ్యాలను చేసి చూపించారు. జంతువులు, దేవతామూర్తులు, గృహోపకరణాల వంటి బొమ్మల్ని విద్యార్థులు ఎంతో సృజనాత్మకంగా తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులు చక్కని ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేసి విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాల్ని నిర్వహిస్తున్న విద్యా విభాగా కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. క్యాంపు నిర్వాహకులు కేతా రామబ్రహ్మం మాట్లాడుతూ పిల్లల్లో మానసిక స్థైర్యం, కొత్త ఆలోచనలు పెంపొందించే ప్రక్రియలో భాగంగా మట్టిబొమ్మల తయారీ నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బొమ్మల తయారీలో ఉత్తమ నైపుణ్యాల్ని ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేతా రామబ్రహ్మం, ఆరె వంశి, ఆర్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మీరావలి, సీతారామయ్య నాగేశ్వరరావు, రమాదేవి, పి.ఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎస్.కాళిదాసు, గ్రంథాలయం అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పది కుటుంబాలు చేరిక

కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులైన పది కుటుంబాలకు చెందిన వ్యక్తులు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరిన రొంపిచర్ల మండలం తురుమెళ్ల పంచాయతీ పరిధిలోని చిట్టిపోతుల వారిపాలెం గ్రామానికి చెందిన వారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల శివారెడ్డి, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ నాయకులు మురళి, విజయ్, కంచేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణ అందరి బాధ్యత

డీఆర్‌వో హరికుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

బొల్లాపల్లి: ప్రజాజీవన విధానంలో అడవులను రక్షించాల్సిన బాధ్యత అందరిదని మేళ్లవాగు సెక్షన్ డీఆర్‌వో ఎం.హరికుమార్ తెలిపారు. పర్యావరణ హిత జీవన విధానంలో భాగంగా మండలంలోని మేళ్లవాగు సెక్షన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను భాగస్వామ్యులను చేసి అటవీ సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్‌ను వాడి అటవీ ప్రాంతాల్లో పడవేయరాదని సూచించారు. అడవుల సంరక్షణతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, ప్రజల భాగస్వామ్యంతో అడవులను పరిరక్షించేందుకు అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు ఆర్. లక్ష్మణ్‌నాయక్, షేక్ అమీర్‌జానీబాషా, వీఎస్ఎస్ సోము శ్రీనివాసరావు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంగ్లిష్ వేసవి శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న గుంటూరు యూటీఎఫ్ కార్యదర్శి ఎండీ షకీలాబేగం

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న వేసవి ఇంగ్లిష్ మీడియం శిక్షణ కార్యక్రమంలో శనివారం ముగిసింది. డీవైఎఫ్‌వై, విద్యావనం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ ముగింపు సమావేశంలో ముఖ్య అతిథి గుంటూరు జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ఎండీ షకీలాబేగం సైన్స్ యొక్క ప్రాధాన్యత, వాస్తవ జీవితం సైన్స్ అంశాలపై ప్రసంగించారు. విద్యార్థులకు ఉచిత ఆంగ్ల శిక్షణకు శ్రీకారం చుట్టిన డీవైఎఫ్ఐ ప్రతినిధులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు సామినేని శ్రీనివాసరావు, ఇంగ్లిష్ భాషా ప్రవీణ్యాన్ని వినూత్న తరహాలో నేర్పిస్తున్న నల్లపనేని అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు జి.కోటేశ్వరరావు, శిక్షణకు సహకారం అందించిన నంబూరి శివరామకృష్ణయ్య, గుంటుపల్లి వెంకటలక్ష్మి, రావూరి సురేష్, కోయా రామోజీ, సీహెచ్ రంగారావు పాల్గొని ప్రసంగించారు.